# పురోగామి

## కొల్లూరి సోమశంకర్




అది ఆహ్లాదపురం ఆరోవీధి. ఆ వీధిలోని పార్కులో కూర్చుని మాట్లాడుకుంటున్నారు ఆ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు.

"శేషాద్రి ఎంతో మారిపోయాడు తెలుసా?" అన్నాడు ప్రెసిడెంట్.

"ఒకప్పుడు ఎలా ఉండేవాడు, ఇప్పుడెలా ఉన్నాడు? రెండేళ్ళలో అసలింత మార్పు ఎలా సాధ్యమైందో" అంటూ ఆశ్చర్యపోయాడు సెక్రటరీ.

"ఎవరి గురించి సార్, మీరు మాట్లాడుతున్నది? మొన్న ఎం.ఎ సోషియాలజీలో గోల్డ్‌మెడల్ అందుకున్న ఆ ముసలాయన గురించేనా?" అడిగింది కళ్యాణి. వాళ్ళు ఈ కాలనీకి ఈ మధ్యే వచ్చారు.

"ఆయన గురించే. మీకు ఆయనగతం తెలియదు కదా. అందుకే మీకు ఆసక్తిగా ఉంటుంది" అన్నాడు ప్రెసిడెంట్.

"ఆయన తాగుడు మాని, కుదురుగా ఉన్నందుకు ఆ పిల్లలెంత సంతోషంగా ఉన్నారో" చెప్పాడు సెక్రటరీ.

"ఏంటి ఆయన తాగుబోతా? నమ్మలేకుండా ఉన్నాను. అరవై ఏళ్ళ వయసులో ఆయన గోల్డ్‌మెడల్ సాధించినట్లు పేపర్లో వార్త చదివినప్పుడు నేనెంత సంతోషించానో. మా పిల్లలకి కూడ చెప్పాను – చూడండి అంత పెద్ద వయసులో కూడా ఆ తాతయ్య బాగా చదివి పెద్ద ర్యాంకు తెచ్చుకున్నారు అని". కళ్యాణి ఆశ్చర్యపోయింది.

"వాడు, నేను చిన్ననాటి మిత్రులం. ఓ మామూలు మధ్య తరగతి కుటుంబంలో మొదటి సంతానం వాడు. బాగానే చదువుకున్నాడు. ఆ రోజులలో ఉద్యోగాల కొరత నేడున్నంత తీవ్రంగా ఉండేది కాదు. డిగ్రీ చేతికి రాగానే ఓ ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం దొరికింది. తర్వాత పెళ్ళి చేసుకుని ముగ్గురు పిల్లల తండ్రయ్యాడు. ఎలా అలవాటైందో తెలియదు గానీ వాడికి మద్యం అలవడింది. క్రమంగా సీసాయే సర్వస్వం అయింది. కుటుంబాన్ని నిర్లక్ష్యం చేసాడు. ఎవరెంత చెప్పినా వినలేదు. ఉద్యోగం పోవడంతో, ఆర్థిక ఇబ్బందుల వల్ల, చదువులు దెబ్బతినకుండా ఉండడం కోసం పిల్లలు వాళ్ల తాతగారింటికి వెళ్ళిపోయారు. కట్టడి చేసేవాళ్ళు ఎవరూ లేక, ఆ దురలవాటుకి పూర్తిగా బానిసయ్యాడు. అప్పటినుంచి పతనం ప్రారంభమైంది" అంటూ చెప్పడం ఆపాడు ప్రెసిడెంటు.

"ఆయనని మార్చడానికి ఎవరూ ప్రయత్నించలేదా?" అడిగింది కళ్యాణి.

"చేయకేం ? నేను, వాడి తమ్ముళ్ళు, ఎదిగిన పిల్లలు కలసి ఎన్నో ప్రయత్నాలు చేసాం. పిల్లల చదువులు పూర్తయి ఉద్యోగాల్లో చేరినా వాడిలో ఏమీ మార్పు రాలేదు. కుటుంబమంతా మళ్ళీ కలిసినా, వాళ్ళకి ఆనందం కరువయ్యింది. శేషాద్రికి తాడుగు మానడానికి హోమియోపతి మందులు కూడా ఇప్పించారు. కాని ఫలితం లేకపోయింది. వాడి చేతికి డబ్బందకుండా చేసారు. కానీ మా వాడు ఊరుకుంటాడా? ఇంట్లో సామాన్లు అమ్మేయడం, అప్పులు చేసేయడం వంటి ఇతర మార్గాలలో డబ్బులు పొందేవాడు. మేము తాగద్దురా అన్నప్పుడల్లా వాడు మరింత మొండికేసేవాడు" చెప్పాడు ప్రెసిడెంటు.

"మరి అలాంటి వ్యక్తి ఇప్పుడిలా ఎలా మారగలిగారు?" ఆసక్తిగా అడిగింది కళ్యాణి.

"నేను చెబుతానమ్మా" అని అంటూ ఓ సిమెంటు బల్లమీద కూర్చున్నాడు. అప్పుడే అక్కడికి వచ్చిన శేషాద్రి ఓ క్షణం ఊపిరి పీల్చుకుని చెప్పడం మొదలుపెట్టాడు. అప్పటిదాక అక్కడ నిలుచుని ఈ సంభాషణ వింటున్న ఇద్దరు కుర్రాళ్ళు గడ్డిమీద కూర్చుని ఆయన చెప్పేది వినడానికి సిద్ధమయ్యారు.

'నా జీవితం అప్పట్లో మూడు సీసాలు ఆరు పాకెట్లుగా సాగిపోతోంది. ఎన్నడూ లేనిది ఆ సంవత్సరం నాకు 'ఫాదర్స్‌డే' గ్రీటింగ్ కార్డు ఇవ్వాలని మా పిల్లలు అనుకున్నారట. వాళ్ళు ఓ చక్కని కార్డు కొని నాకివ్వడానికి వచ్చారు. కాని నేను అప్పటికే పూర్తి నిషాలో ఉన్నాను. వాళ్ళేదో మాత్రలు తెస్తున్నారనుకుని, నా దగ్గరికి రానీయకుండా, మా ఆఖరువాడిని గట్టిగా తోసాను. అంతే... వెళ్ళి గోడకి గుద్దుకున్నాడు. తలకి గట్టిగా దెబ్బతగిలినట్లుంది. రక్తం కారుతుండడంతో నన్ను వదిలేసి వాడికి ఆసుపత్రికి తీసుకెళ్లారు. మత్తు దిగాక తెలిసింది – వాడికి పెద్ద దెబ్బే తగిలిందని, స్పృహలో లేడని. ఇరవైనాలుగు గంటలు గడిస్తే గానీ ఏ సంగతి చెప్పలేమన్నారట డాక్టర్లు. మొట్టమొదటిసారిగా నేను అప్పుడు సిగ్గు పడ్డాను. పిల్లలిచ్చిన కార్డు తీసి చూసాను. దాంట్లోని మెసేజ్ ఎంతో బావుంది. ఆ కవర్లో ఓ ఉత్తరం కూడా ఉంది. జరిగిన సంఘటన, ఆ ఉత్తరం... నాలో మార్పు తెచ్చాయి. ఆ రోజు నుంచి నేను మళ్ళీ తాగలేదు".

"ఆ ఉత్తరం అంత ఎఫెక్టివ్‌గా ఉందన్న మాట" అంది కళ్యాణి.

'అవును. ఆ ఉత్తరాన్ని నా ఇంటర్వ్యూతో పాటు 'సాయంకాలం' పేపరులో ఎల్లుండి ప్రచురిస్తున్నారు. నేనిప్పుడు ఆ పత్రికాఫీసు నుంచే వస్తున్నాను. ఇదుగో ఆ ఉత్తరం. చదువుకో" అంటూ జేబులోంచి ఓ కాగితాన్ని తీసి ఆమెకందించాడు శేషాద్రి.

— — —

"నాన్నా ఒకే ఇంట్లో ఉంటూ ఈ ఉత్తరం ఏంటని ఆశ్చర్యపోవద్దు. పూర్తిగా చదవండి. చాలా రోజులుగా మాలో గూడు కట్టుకున్న వేదనకి ఇది ప్రతిరూపం. మీరు తాగుడు మొదలుపెట్టి దాదాపు పాతికేళ్ళు అయ్యుంటుంది. ఈ అలవాటు వల్ల మీరేం పొందారో తెలియదు గానీ, పోగొట్టుకున్నది మాత్రం కుటుంబసభ్యుల ఆత్మీయతా, అనురాగాలు !

సరదాగా మొదలుపెట్టారో లేక బాధల్ని

(?) మరచిపోడానికి తాగుడు అలవాటు చేసుకున్నారో మాకు తెలియదు. కానీ మీలాంటి విద్యావంతులు సైతం కష్టాలెదురైతే వాటిని ఎదుర్కోకుండా, దూరంగా పారిపోయి, తాగుతూ కూర్చుంటే బాధల్ని మరచి పోతామని భ్రమించడం ఆశ్చర్యం కలిగిస్తోంది. మద్యం లోపలికి పోయి, వివేకాన్ని బయటికి తరిమే స్తుందన్న నానుడి నిజం. ఎప్పుడైతే మీకు కుటుంబం కంటే తాగుడే ఎక్కువైందో.... అప్పుడే మీలో వివేకం పూర్తిగా నశించింది. ఇంట్లోని ఒక్కో వస్తువు తాకట్టు కొట్టులోకి చేరడం; మీరు నెలకో కొత్త ఉద్యోగంలో చేరడం, వారంలో దాన్ని పోగొట్టుకోడం దీనికి నిదర్శనాలు. సారాకోసం ఇంట్లోని బియ్యాన్ని తక్కువ ధరకి అమ్మేయడం మీకే చెల్లింది. లోకంలో ఎందరో తాగుబోతులున్నారు. కానీ మీలా ఎవరూ దిగజారి పోయుండరు. మాకు మార్గ దర్శకుడిగా ఉండాల్సిన మీరే దారి తప్పి ప్రవర్తించారు.

'నేనెలా ఉంటేనేం? మీకు తిండికి ఏ లోటు చేయలేదుగా?' అని అడిగారు. ఒక తండ్రిగా, పిల్లలకు కేవలం తిండి ఏర్పాటు చేయడమేనా మీ బాధ్యత? పిల్లలకి సాంఘికంగా గౌరవం కల్పించా ల్సింది మీరేగా? మా స్కూలు ఫీజులు గానీ, బస్‌పాస్ డబ్బులు గానీ ఎప్పుడూ నిర్ణీత గడువులోగా కట్టినట్లు మాకు గుర్తు లేదు. ఒకచోట ఇంటద్దె కట్టకపోతే, ఆ ఓనర్ అద్దెగా మన మంచం, ఇంట్లోని కొన్ని సామానులు మినహాయించుకున్నాడన్న సంగతి మీరు మరిచిపోయారేమో గానీ, మాకింకా గుర్తుంది.

మేమెక్కడికి వెళ్ళినా, ఓ తాగుబోతు పిల్లలుగా మమ్మల్ని చిన్నచూపు చూసేవాళ్ళు. మా పైన అనవసరమైన జాలి, సానుభూతి చూపించేవారు. అందరు పిల్లల్లా మేము లేమని అర్థమయ్యేసరికి, మాబాల్యం గడిచిపోయింది. మేము మీకు మాన సికంగా దూరమయ్యాం. మీ ఈ దురలవాటు వల్ల అమ్మ ఎన్నో హేళనలు, అవమానాలు ఎదుర్కొంది. మా కోసం, మా భవిష్యత్తు కోసం వాటిని భరించింది. అమ్మకి ఊరట కలిగించేలా మేము బాగా చదువుకుని జీవితంలో సిర్థపడ్డాం. గతకొద్ది కాలంగా మీరు, అందరూ మిమ్మల్ని చీదరించుకునే స్థాయికి చేరు కున్నారు. రోజుల తరబడి మాసిన బట్టలతోనే ఉండడం, చెప్పులు లేకుండా వీధుల్లో తిరగడం, రాత్రిళ్ళు ఇంటికి రాకుండా రోడ్లపైనే నిద్రపోవడం, కాస్త పరిచయం ఉన్నవాళ్ళు కనపడితే వాళ్ల దగ్గర నుంచి పదో ఇరవయ్యో లాగేయడం, వాళ్లని మీ వాగుడితో విసిగించడం, అందరూ మీ సూచనలు సలహాలకోసమే ఎదురు చూస్తున్నట్లు ఇతరుల విషయాలలో అనవసరంగా జోక్యం చేసుకోడం వంటి మీ చర్యలు మాకు ఎప్పటికప్పుడు కొత్త సమస్యల్ని తెచ్చి పెడుతున్నాయి.

ఇవన్నీ చూస్తుంటే మీకసలు ఆత్మగౌరవ మనేది ఉందా అని సందేహం వస్తోంది. మీరిలా తయారవడానికి కారణం మీ స్వయంకృతమే తప్ప, విధిరాత కాదు. మీకేసి శుక్రుడు వక్రంగా చూడడం వల్ల అంతకంటే కాదు ! మీరు నిరంతరం పతనా వస్థలోనే ఉండాలనుకుంటున్నారు. తద్వారా జనాల సానుభూతిని పొందాలని తాపత్రయపడుతున్నారు. మీ అహాన్ని, సెల్ఫ్‌పిటీని పక్కనబెట్టి, నిజాయితీగా ఆత్మవిమర్శ చేసుకోండి.

ఎవరి జీవితం వాళ్ళదే ! ఎవరైనా సరే, వారంతట వారే తమ జీవితాలను చక్కదిద్దుకోవాలే గానీ, వేరెవరో వచ్చి తమని బాగుచేయాలనుకోవడం అత్యాశే అవుతుంది. మిమ్మల్ని మార్చడానికి మేమెందుకు ప్రయత్నం చేయడం లేదని ఓ మేధావి ఆరా తీశాడు. మరో అడుగు ముందుకేసి - మిమ్మల్ని మారిస్తేనే మా జీవితాలకి సార్థకత అని అన్నాడు. అసలు మారాలని మీకు లేనప్పుడు, ఎవరేం చెప్పినా, ఎన్ని మందులు వాడినా ప్రయోజనం ఉండదు. గతం ఎలా గడిచినప్పటికీ, వర్తమానంలో జీవితాన్ని పునర్నిర్మించుకునే అవకాశాలను మీరు కాలరాయడం మమ్మల్ని నిరాశపరుస్తోంది.

తాగుడు వల్ల ఎన్ని కుటుంబాలు నాశన మయ్యాయో, ఎందరి జీవితాలు ఛిద్రమయ్యాయో తెలిసి కూడా తాగుడు మానకపోవడం క్షమించరాని నేరం ! విద్యావంతులై ఉండి, ఎన్నో తెలివితేటలు కలిగి ఉండి కూడా జీవితాన్ని చక్కదిద్దుకునే ప్రయత్నం మీరు చేయకపోవడం మాకు బాధ కలిగిస్తోంది. ఇకనైనా మీరు మారాలని, ఆ దురలవాటుని వదులు కుని, సమాజంలో గౌరవంగా బతకాలని మా ఆశ. మేము మీకు మానసికంగా దగ్గరవ్వాలనుకుంటున్నాం. మీరు మారితే, మేము మీ మీద లేని ప్రేమని ఒలక పోస్తామనడం లేదు. మా గుండెలోతుల్లోకి ఇంకి పోయిన మీపై ప్రేమని, గౌరవాన్ని బయటకు తెస్తాం.

మార్పనేది ఒక్కరాత్రితో రాదని మాకూ తెలుసు. అయితే మారడానికి మీరు నిజాయితీగా చేసే ప్రయత్నాలకు మా సహకారం ఎప్పుడూ ఉంటుంది. ఏదో జనవరి ఒకటినుంచో, లేకపోతే ఉగాది నుంచో కొత్త జీవితాన్ని ప్రారంభించాలని అనుకోవద్దు. 'తన జీవితాన్ని చక్కదిద్దుకోవాలనుకునే మనిషికి వర్తమానాన్ని మించిన సమయం లేద'నే సామెతని గుర్తు చేసుకోండి. మీరు మారితే, మార గలిగితే, మీకు మా హృదయాలలోనికి స్వాగతం చెప్తాం ! మా ఆదరాభిమానాలు పొందాలను కుంటారో... లేక మత్తులో మునిగి ఉంటారో మీ ఇష్టం ! ఇక ఉంటాం.

ఇట్లు
మీ పిల్లలు

— — —

ఒకరి తర్వాత ఒకరు అక్కడున్నవారంతా మౌనంగా ఆ ఉత్తరాన్ని చదివారు. నిశ్చేష్టులై ఉండిపోయారు. గుండుసూది పడినా, ఆ చప్పుడు వినిపించేంత నిశ్శబ్దం అక్కడ ఆవరించింది.

శేషాద్రి మళ్ళీ మాట్లాడుతూ.... "దేవుడి దయవల్ల మా అబ్బాయికి ప్రమాదం తప్పింది. వాడు ఆసుపత్రి నుంచి ఇంటికొచ్చిన రోజునే నేను నిర్ణయించుకున్నాను - జీవితంలో ఇక మళ్ళీ తాగనని! తర్వాత మా పిల్లలు నన్ను 'ఆల్కాహాలిక్స్ అనోనిమస్' వాళ్ళకి పరిచయం చేసారు. వాళ్ళిచ్చిన ట్రీట్‌మెంట్, సలహాలు, పిల్లల ప్రోత్సాహం వల్ల నేను రెండేళ్ళలో నా వ్యసనాన్ని వదుల్చుకోగలిగాను. ట్రీట్‌మెంట్ మధ్యలో ఎన్నోసార్లు తాగాలనిపించేది. అప్పుడు నేను రక్తం ఓడుతున్న మా అబ్బాయి ముఖం గుర్తుకు తెచ్చుకునేవాడిని. దాంతో క్రమంగా తాగాలన్న కోరిక క్షీణించింది. తర్వాత ఖాళీగా ఉండి ఏం చేయాలన్న సమస్య మొదలైంది. పిల్లలు సలహా ఇచ్చారు - మళ్ళీ చదువుకోమని ! దాని ఫలితమే ఈ ఎం.ఎ సోషియాలజీ. నా పాత జీవితానికి స్వస్తి చెప్పానని ఋజువు చేసుకోడానికి కష్టపడి చదివాను. లోకుల మెప్పుకోసం కాకుండా మా పిల్లలకి నన్ను నేను నిరూపించుకోడానికోసం తీవ్రంగా శ్రమించాను. ఫలితంగా సాధించిన ఈ విజయం... వాళ్ళకే అంకితం.." అన్నాడు శేషాద్రి కాస్త ఉద్వేగంగా.

తనతో పాటు తెచ్చుకున్న బాటిల్‌లోంచి కాస్త మంచినీళ్ళు తాగి, తన చుట్టూచేరిన కుర్రాళ్ళని చూస్తూ, మళ్ళీ చెప్పడం ప్రారంభించారు.

"ఇంకో మాట ! నిన్ననే నాకు ఓ స్వచ్ఛంద సంస్థలో కౌన్సిలర్‌గా ఉద్యోగం... కాదు కాదు.:.. వ్యాపకం దొరికింది. తాగుడు అలవాటైన వారికి తగిన సలహాలిచ్చి, దాన్నుంచి బయటపడేయడమే మా సంస్థ లక్ష్యం. చివరగా మీ యువతరానికో హెచ్చరిక ! దురలవాట్లు ఊబిలాంటివి. పొరపాటున అడుగేసామో, కూరుకుపోడం ఖాయం ! జీవితంలో క్రమశిక్షణ లోపించడం, బ్రతుకు పట్ల నిబద్ధత లేకపోవడం, వ్యక్తిత్వ రాహిత్యం... ఓ రకంగా అన్ని సమస్యలకి మూలకారణాలు. జీవితం మనకి లభించిన ఓ అద్భుతమైన అవకాశం. దాన్ని దుర్వినియోగం చేసుకోవద్దు. ఆల్ ది బెస్ట్!....."

ఆయన పతనోత్థానాలు అక్కడున్న వారి మనసుపై చెరగని ముద్ర వేసాయి. వెంటనే అందరూ చప్పట్లు కొట్టారు. ప్రెసిడెంటు శేషాద్రిని ఆలింగనం చేసుకున్నాడు. వాళ్ళిద్దరూ అక్కడినుండి కదలి వాళ్ళింటి వైపు అడుగులు వేసారు.